# గొఱ్ఱెల మంచి కాపరి
# (10:1–21)

దేవుని గూర్చి మనం మన మనస్సుల్లో ఉంచుకొని మనతో కొనిపోయే మానసిక చిత్రం దేవుడు మనకు కాపరి అనేది అయ్యుండవచ్చు. అది కాపుదల, శ్రద్ధ, సున్నితత్వం, త్యాగంతో కూడిన స్వరూపమై ఉంటుంది. కొన్ని సార్లు దేవుడు కాపరియైనట్టును మనము ఆయన మేపు గొర్రెలమైనట్టును పోల్చుకొనడం తగినదై ఉంటుంది. ఉదాహరణకు, గొర్రెలకు కనుచూపు తక్కువగాను, దారి చూపే భావన అల్పంగాను ఉంటుంది. పైగా శత్రువులు వాటిపైబడినప్పుడు వాస్తవానికి కాపుదల లేనివై ఉంటాయి. భయపెట్టినప్పుడు, కాళ్లు తమ క్రింద పెట్టకొని కూర్చుండిపోతాయి. ప్రవర్తించే విధానంలో గొర్రెలు తెలివి తక్కువైనవిగా ఉంటాయి. పొలంలో ఒక గొర్రె ఒకవైపుకు దాటిందంటే, ప్రతిదీ అలాగే దాట జూస్తాయి. (దీనిని గొర్రె దాటుడు అని అంటారు). అనేక సార్లు గొర్రెలు వెళ్లే పచ్చిక బీడులనుండి, అవి దాహంచే చావకుందునట్టు కాపరులు వాటిని నీటి తొట్ల యొద్దకు తోలుకొని రావలసి ఉంటుంది. గొర్రెలకు సహాయం కావాలి, అలాగే మనకు కూడా!

"కాపరి" అంటే, ఎప్పుడూ సద్భావన కలిగించే పదం కాదు. కొన్ని నాగరికతలలో, కాపరులు అనేవారు సోమరులైన తిండిబోతులు, బాధ్యతా రహితమైన త్రాగుబోతులునై ఉంటారు. "తండ్రి" అనే పదం శ్రేష్ఠమైన సద్గుణానికిని, దుర్గుణానికిని అర్థంగా ఎలా నిలిచే అవకాశముందో, అలాగే "కాపరి" అనేది ఔదర్యానికిని, అవమానకరమైన దానికిని అర్థంగా నిలిచియుండవచ్చు. ఉదాహరణకు, కీర్తన. 23 దేవుణ్ణి శ్రద్ధగల కాపరిగా చిత్రిస్తుంది. దానికి భిన్నంగా దుష్టులైన కాపరులను పాత నిబంధన ప్రవక్తలు యిలా చిత్రించారు:

> పొలములోని సమస్త జంతువులారా,
> అడవిలోని సమస్త మృగములారా, భక్షించుటకు రండి.
> వారి కాపరులు గ్రుడ్డివారు వారందరు తెలివిలేనివారు
> వారందరు మూగకుక్కలు మొరగలేరు
> కలవరించుచు పండుకొనువారు నిద్రాసక్తులు
> కుక్కలు తిండికి ఆతురపడును, ఎంత తినినను వాటికి తృప్తిలేదు.
> ఈ కాపరులు అట్టివారే వారు దేనిని వివేచింపజాలరు
> వారందరు తమకిష్టమైన మార్గమున పోవుదురు
> ఒకడు తప్పకుండ అందరు స్వప్రయోజనమే విచారించుకొందురు.
> వారిట్లందురు – నేను ద్రాక్షారసము తెప్పించెదను
> మనము మద్యము నిండారులగునట్లు త్రాగుదము రండి

నేడు జరిగినట్టు రేపు మరి లక్షణముగా జరుగును
(యెషయా 56:9-12).

"యెహోవా వాక్కు ఇదే - నా మందలో చేరిన గొఱ్ఱెలను నశింపజేయుచు చెదరగొట్టు కాపరులకు శ్రమ." ఇశ్రాయేలు దేవుడైన యెహోవా తన జనులను మేపు కాపరులను గూర్చి యీలాగున సెలవిచ్చుచున్నాడు - "మీరు నా గొఱ్ఱెలనుగూర్చి విచారణచేయక, నేను మేపుచున్న గొఱ్ఱెలను చెదరగొట్టి పారదోలితిని; ఇదిగో మీ దుష్క్రియలను బట్టి మిమ్మును శిక్షింపబోవుచున్నాను;" ఇదే యెహోవా వాక్కు. "మరియు నేను వాటిని తోలివేసిన దేశములన్నిటిలోనుండి నా గొఱ్ఱెల శేషమును సమకూర్చి తమ దొడ్లకు వాటిని రప్పించెదను; అవి అభివృద్ధిపొంది విస్తరించును. నేను వాటిమీద కాపరులను నియమించెదను; ఇకమీదట అవి భయపడకుండను బెదరిపోకుండను వాటిలో ఒకటైనను తప్పిపోకుండను వీరు నా గొఱ్ఱెలను మేపెదరు"; ఇదే యెహోవా వాక్కు (యిర్మీయా 23:1-4).

యోహాను 10 సాధారణంగా "గొఱ్ఱెల మంచి కాపరి అధ్యాయమని" పిలువ బడుతుంది. పుట్టు గుడ్డివానిని ప్రభువు బాగుచేసిన కథను, ఆయన వ్యతిరేకుల ఆత్మ సంబంధమైన అంధత్వపు చర్చతోను యిది వెంటవస్తుంది. ఈ సువార్తలో దాఖలు చేయబడిన ప్రభువు యొక్క చివరి బహిరంగ ప్రసంగాన్ని యోహాను వర్ణిస్తున్నాడు. అజ్ఞానంనుండి చర్చ గొర్రెల మీదికి మళ్ళబడింది. అయితే సందేశం మాత్రం దాదాపుగా అదే: యేసు నిజముగా దేవుని కుమారుడైయున్నాడు, మరియు నిష్కపటమైన సున్నితమైన హృదయాలు గలవారు దానిని అంగీకరిస్తారు. "నేనే" అని యేసు చెప్పుకున్న మరి రెండు విషయాలపై మన లేఖన భాగము యొక్క వర్తమానం కేంద్రీకరించబడింది.

## "ద్వారమును నేనే" (10:1-10)

గొర్రెలు, కాపరి అనే రూపకాలంకారంతో ఆరంభమైన ప్రసంగంలో ప్రభువైన యేసు బాగుగా ఎరుకైయున్న గొఱ్ఱె దొడ్డిని ఉపయోగించాడు (10:1-5). కొన్నిసార్లు రాళ్లు లేక ముండ్లతో చేయబడిన దొడ్డిలోనికి రాత్రులందు గొర్రెలు తేబడతాయి. దొంగలు, అడవి మృగాలనుండి గొర్రెలను కాపాడడానికి యిది సులభమైన మార్గమై ఉంటుంది. తమ గొర్రెలను నడిపించడానికి కాపరి ద్వారం గుండా ప్రవేశిస్తాడనే సత్యాన్ని ప్రభువు తన శ్రోతలకు వినిపిస్తున్నాడు. కాపరులు తమ గొర్రెలను పేరు పెట్టి పిలుస్తారు. వారి గొర్రెలు యిష్టపూర్వకంగా వాటిని వెంబడిస్తాయి. దొంగ గొర్రెలను దొంగిలించడానికి గోడ దూకి వస్తాడు. ఇందులో, దేవుని ప్రజలను మోసగించడానికో లేదా తంత్రంతో లాగుకొనడానికో రాలేదని ప్రభువైన యేసు తెలిపాడు. ఆయన బహిరంగంలో స్పష్టంగా మాట్లాడుతూ తన శిష్యులను సమకూర్చడానికి ద్వారం గుండానే వచ్చినట్టు తెలిపాడు. అయినా, ఆ సమయంలో తన శ్రోతలు ఆయనను అర్థం చేసికోలేదు (10:6).

ప్రభువైన యేసు మరలా మాట్లాడుతూ యిలా అన్నాడు: "గొఱ్ఱెలు పోవు ద్వారమును నేనే" (10:7). ఇతరులు దేవుని కాపరులుగా తమ్మును గూర్చి తాము చెప్పుకొని యుండవచ్చు, వారు కేవలము దొంగలును దోచుకొనువారునై ఉన్నారు. నిజమైన దేవుని

గొర్రెలు అబద్ధపు కాపరుల స్వరాన్ని అనుసరింపలేవు. దేవుని యొద్దకు తాను మాత్రమే నిజమైన ద్వారమైయున్నట్టు ప్రభువు చెప్పుకున్నారు. "నేనే మార్గమును, సత్యమును, జీవమును; నా ద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడు" అని ఆయన తరువాత చెప్పిన మాటను పోలి యిది ఉన్నది (యోహాను 14:6). "ద్వారమును నేనే" అనేది తండ్రి వద్దకు తాను మాత్రమే మార్గమైయున్నట్టు ఆయన చెప్పుకున్నాడు. వేరొక ద్వారమున వచ్చువాడు దొంగయు దోచుకొనువాడునై ఉంటాడు. క్షౌరాలు చేసే షాపువద్ద బూటు పాలిష్ చేస్తూ, నేలను శుద్ధి చేస్తూ ఉండే ఒక నవ యువకుని నేనొకప్పుడు ఎరుగుదును. కొద్ది కాలం తరువాత, ఆ షాపులో కోకో కోలావంటి డ్రింక్ యంత్రానికి ఎంత డబ్బు ఖర్చు పెట్టబడుతుందో అతడు గమనించాడు, ఆ డబ్బును అతడు ఎలా దొంగిలించాలో ప్లాన్ చేశాడు. ఒక రోజు మధ్య రాత్రి సమయానికి అతడు ఆ క్షౌరాలు చేసే షాపు దగ్గరకు వచ్చి, పై కప్పులోని సందుగుండ అతడు ఆ షాపులోనికి ప్రవేశింపజూచాడు. అయితే అతనికెదురైన ఒకే ఒక సమస్య ఏమంటే, అతడు ఆ సందులో యిరుక్కపోయాడు. పోలిస్ అతన్ని కనుగొన్నప్పుడు, సహాయం కొరకు అర్థిస్తూ, తప్పయినదేదీ తాను చేయలేదని వివరించ ప్రయత్నించాడు. అయినా, అతని కథను ఎవడూ నమ్మలేదనుకో! ఏమీ దోచుకోనవసరం లేని యథార్థ వ్యక్తులు పై కప్పుగుండా దూరవలసిన అవసరం ఉండదు; వారు గుమ్మం గుండానే ప్రవేశిస్తారు. అబద్ధ బోధకులను గూర్చి ప్రభువు చెప్పే విషయం యిదే.

మతం యొక్క "మురికి సందులలో" ఒకటి ఏమంటే – కొందరు మత నాయకులు దేవుని విషయమందు యిష్టం లేనివారై ఉంటారు. తమ దురాశ, ధనము, స్థితి, లేక అధికార వాంఛను తృప్తిపరచడానికి మాత్రమే సంఘ సంబంధమైన కార్యక్రమములలో కొందరు నిమగ్నమై ఉంటారు. అపకీర్తి ఒకటి బయటికి వచ్చిన ప్రతిసారి, సంఘ నాయకుడు అలా జరిగిస్తాడా అంటూ ఆశ్చర్యపోతాం. దొంగలును దోచుకొనువారును గొర్రెలను ఎత్తికొనిపోయినప్పుడు, ప్రభువు ఆశ్చర్యపడతాడని నేను నమ్మను. గొర్రెల మంద కావాలని కోరుకున్నవాడు కేవలం ఆయన మాత్రమే కాదు. అయినా, మందకు నిజమైన కాపరి ఆయనే అయ్యున్నట్టు ఆయనకు తెలుసు. ఆయనే మంద విషయమై నిజమైన అక్కరగలవాడై ఉన్నాడు. "గొఱ్ఱెలకు జీవము కలుగుటకును అది సమృద్ధిగా కలుగుటకును నేను వచ్చితినని మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని" ఆయన అన్నాడు (10:10బి).

యోహాను సువార్త రచన అంతటిలో, యేసు ద్వారము గుండా ప్రవేశిస్తున్నట్టు చూపించబడ్డాడు. ఆయన పరిచర్య మోసంతోగాని, స్వార్థపరత్వంతోగాని, తంత్రంతోగాని సంబంధం కలిగియున్నది కాదు. ఆయన మాటలు గొప్ప వాగ్వాదాన్ని రేపినా, అది కడకు ఆయన మరణానికే దారితీసినా, ప్రభువైన యేసు మాత్రం "ద్వారం" గుండా నడవడానికి వెనుకాడలేదు. మిగిలిన లోకమంతా ఏమి చేసినా, తమ హృదయాలు దేవుని వైపుకు త్రిప్పినవారు మాత్రం ఆయన స్వరాన్ని విని విధేయులౌతారని ఆయనకు తెలుసు.

మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో, తురుష్క సైనికులు కొందరు ఇశ్రాయేలీయుల శిబిరంలోని గొర్రెల మంద సమీపంగా శిబిరం వేసికొన్నారు. వారు గొర్రెలను తమ

విడిదివైపుకు మళ్లించారు. అది వారికి ఆశ్చర్యమైన విందు కానున్నట్టు తలంచారు. ఆ సైనికులను ఎదిరించడానికి ఆ గొర్రెల కాపరి వద్ద ఏ విధమైన ఆయుధం లేదు. గనుక తన వెనక తట్టుకు ఎంత వేగంగా పరుగెత్తగలడో అంత వేగంగా పరుగెత్తి, లోతైన నీటి వాగును దాటి సమీపానున్న ఒక కొండ శిఖరానికి ఎక్కాడు. అప్పుడు తన రెండు చేతులను బూరలా తన నోటి ముందర ఉంచుకొని, గతంలో అతడు అనేక పర్యాయాలు జరిగించినట్టే గొప్ప శబ్దంతో తన గొర్రెలను పిలిచాడు. వెంటనే ఆ గొర్రెలు ఆ సైనికులతో వెళ్లడం మాని, తమ కాపరి ఉన్న దిశకు పరుగులెత్తనారంభించాయి. చీకటిలో అంతర్ధానం కాకుండా తమ "విందును" నిలుపుకోడానికి ఏమీ చేయలేక పోయినందుకు సైనికులు ఆశ్చర్యపడ్డారు.[1]

నేడు తన గొర్రెలతో ప్రభువైన యేసుకు ఉన్న సంబంధం యిదే! ఆయన గొర్రెలు ఆయన శబ్దాన్ని యింకా వింటాయి. నిజంగా దేవుని వెదకేవారు ఆయన స్వరాన్ని గుర్తించి ఆయనను కనుగొంటారు. ఆయన వారికి సమృద్ధియైన జీవాన్ని ప్రసాదిస్తాడు. "జీవము" అనేది యోహాను సువార్తలో కేంద్ర బిందువైయుంది (20:31). అది "మంచి జీవితం కాదు" లేక మనం తరచుగా వెంటాడే "సులభమైన జీవితం కాదు"; తమ స్వరాన్ని వినేవారికి ప్రభువైన యేసు ప్రసాదించే "సమృద్ధియైన జీవమై" ఉంది.

## "నేను గొఱ్ఱెల మంచి కాపరిని" (10:11-18)

తాను ద్వారమైయున్నట్టు యేసు చెప్పుకున్నదానితో సంబంధం కలిగియుండియు, "నేను గొఱ్ఱెలకు మంచి కాపరిని" అని ఆయన ప్రకటించుకున్నది కొంత విభిన్నంగా ఉంది (10:11ఎ). ముందుగా ప్రస్తావించినట్టే, "కాపరి" అంటే పలు భావాలు కలిగి యుండవచ్చు. ఈ సందర్భంలో, ప్రభువైన యేసు మనస్సులో ఒక ప్రత్యేకమైన అర్థంతో అది నిలిచియుంది: "మంచి కాపరి గొఱ్ఱెలకొరకు తన ప్రాణము పెట్టును" (10:11బి). యోహాను సువార్తలో ఆయన మరణం యింకా తొమ్మిది అధ్యాయాలవరకు దాఖలు చేయబడకపోయినా, సిలువ యొక్క భావమేమో ప్రభువు తన శిష్యులకు సూచించుతునే వచ్చాడు. గొర్రెల మంచి కాపరిగా, గొర్రెల కొరకు ఆయన తన ప్రాణాన్ని ఇవ్వడానికి యిష్టపడుతున్నాడు, సిద్ధంగా ఉన్నాడు. ఈ క్లుప్త సందేశంలో తన మరణం తన స్వాధీనంలోనే ఉన్నట్టు ఆయన అయిదు సార్లు నొక్కి పలికాడు. ఆయన మృతి చెందినప్పుడు, ఆయన తన ప్రాణం పెట్ట కోరుకున్నందుననే అది జరిగినట్టు తెలుస్తుంది!

"... మంచి కాపరి గొఱ్ఱెలకొరకు తన ప్రాణము పెట్టును" (10:11).

"... గొఱ్ఱెలకొరకు నా ప్రాణము పెట్టుచున్నాను" (10:15).

"నేను దాని మరల తీసికొనునట్లు నా ప్రాణము పెట్టుచున్నాను" (10:17).

"ఎవడును నా ప్రాణము తీసికొనదు; నా అంతట నేనే దాని పెట్టుచున్నాను" (10:18ఎ).

"దాని పెట్టుటకు నాకు అధికారము కలదు, దాని తిరిగి తీసికొనుటకును నాకు అధికారము కలదు" (10:18బి).

తన ప్రాణాన్ని పెట్టడమే మంచి కాపరి యొక్క కడపటి నిరూపణమైయుంది. జీతగాడు ఆలాటి నమ్మకత్వాన్ని గాని, త్యాగాన్ని గాని ప్రదర్శించలేడు. ఆపద వచ్చినప్పుడు, గొర్రెలను మరచి లేక విడిచి వారు దాగుకొంటారు.

(ఇశ్రాయేలు రాజైన దావీదు) తన యౌవన కాలంలో గొర్రెల కాపరియై ఉన్నాడు. ఆ స్థితిలో అతడు జీవితాన్ని గూర్చి, నాయకత్వాన్ని గూర్చి, దేవుని గూర్చి ఎక్కువగా నేర్చుకున్నాడు. ప్రత్యేకించి గొర్రెల మంచి కాపరియై ఉండడం ఎట్టిదో అతడు నేర్చుకున్నాడు. ఫిలిష్తీయుల శూరుడైన గొల్యాతును ఎదుర్కొన బోయినప్పుడు, దావీదు సౌలుతో యిలా తెలియజేశాడు:

–మీ దాసుడనైన నేను నా తండ్రియొక్క గొఱ్ఱెలను కాయుచుండ సింహమును ఎలుగుబంటియును వచ్చి మందలోనుండి ఒక గొఱ్ఱెపిల్లను ఎత్తికొని పోవుచుండగ, నేను దానిని తరిమి చంపి దాని నోటనుండి ఆ గొఱ్ఱెను విడిపించితిని; అది నా మీదికి రాగా దాని గడ్డము పట్టుకొని దానిని కొట్టి చంపితిని. మీ దాసుడనైన నేను ఆ సింహమును ఎలుగుబంటిని చంపితినే, ... యీ సున్నతిలేని ఫిలిష్తీయుడు వాటిలో ఒకదానివలె అగును ... (1 సమూ. 17:34–36).

ఇశ్రాయేలు భావి రాజు నమ్మకమైన గొర్రెల మంచి కాపరిగా తనను తాను రుజువు చేసికొన్నాడు; తరువాత అతడు దేవుని ప్రజలపై నమ్మకమైన కాపరిగా రుజువు చేసికోబోతాడు (రాజుగా చేయక ముందు దావీదు పరిస్థితి అది).

సువార్త రచనలలో యేసు "దావీదు కుమారుడని" తరచుగా పిలువబడినవాడై, గొర్రెల మంచి కాపరిగా ఉన్నాడు. దావీదు తన మందకొరకు తన ప్రాణాన్ని పెట్టిన దానికంటెను మిన్నగా, ఈయన తన గొర్రెల యొక్క భద్రతకొరకును, క్షేమంకొరకును తన ప్రాణాన్ని ధారబోశాడు. గొర్రెల మంచి కాపరిగా ఆయన మాట్లాడుతూ, "తనంతట తానే" సిలువ మరణాన్ని ఎదుర్కొన బోతున్నట్టు ప్రభువు తేటపరిచాడు (10:18). యేసు యొక్క సిలువ మరణంలో, యూదాకు ప్రధాన యాజకులకు, పిలాతుకు, జన సమూహానికి వారి వారి భాగాలు ఉన్నాయి. కాని యేసు గొర్రెల కొరకు తన ప్రాణం పెట్ట నిష్టపడినందుననే యింతటి క్రూరచర్య జరిగినట్టు వారు గుర్తించినవారు కారు. ఆయన గొర్రెల మంచి కాపరి!

యోహాను సువార్తలో తరువాత, గొర్రెల మంచి కాపరి అనే తన చర్చలో యేసు చేసిన రెండు ప్రతిపాదనలు గుర్తుకు వస్తాయి. ప్రభువుకు తీర్పు తీర్చే సమయంలో రోమా అధిపతియైన పిలాతు యేసును ఒక ప్రశ్న అడుగుతాడు. ఆయన అతనికి బదులు చెప్ప నిరాకరించగా, పిలాతు ఆయనను యిలా అడుగుతాడు: "–నాతో మాటలాడవా? నిన్ను విడుదల చేయుటకు నాకు అధికారము కలదనియు, నిన్ను సిలువవేయుటకు నాకు అధికారము కలదనియు నీ వెరుగవా?" (19:10). అందుకు గొర్రెల మంచి కాపరియైన యేసు – "పైనుండి నీకు ఇయ్యబడియుంటేనే తప్ప నామీద నీకు ఏ

అధికారమును ఉండదు ...” అని ఉత్తరమిచ్చాడు (19:11). ఆ సమయంలో ఎవరూ దానిని గ్రహించలేకపోయినా, ప్రభువైన యేసు యిష్టపడకపోయినట్టయితే, పిలాతు ఆయనను సిలువ వేయించలేకపోయేవాడు. సిలువ మరణం అనేది గొర్రెల మంచి కాపరి యొక్క త్యాగ పూరితమైన ప్రేమయై ఉంది! యేసు సిలువపై వ్రేలాడుతున్నప్పుడు, చివరిగా “తల వంచి ఆత్మను అప్పగించెను” (19:30). యోహాను మాటలలో ఆకస్మిక సంభవం ఏమీ లేనట్టు కన్పిస్తుంది. ప్రభువైన యేసు ప్రాణాన్ని ఎవడును ఆయన వద్దనుండి తీసికోలేదు. ఎవడును ఆయనను హత్య చేయలేదు. ఎవని కుట్రవలన గాని, లేదా ఎవడు వలవేసిగాని ఆయనకు సిలువ మరణం విధింపలేదు. ఆయన తన ఆత్మను తానే అప్పగించుకున్నాడు.

## ముగింపు (10:19, 20)

మరల, అద్భుతమైన యేసు మాటలు ప్రజల మధ్య భేదాన్ని పుట్టించాయి. కొందరు ఆయనను అవమానపరచడానికి యిలా పలికారు. అంటే “పిచ్చి పట్టినవాడని,” లేక “మానసికమైన వెర్రితనం కలిగినవాడని” నేడు అన్నట్టు అలా ఆయనపై నేరం మోపారు. మరి కొందరైతే పుట్టు గుడ్డివాని కన్నులు తెరిచిన అతని శక్తివంతమైన అద్భుతానికి ఆశ్చర్యపడుతునే ఉన్నారు. నమ్మశక్యం కానంత ఆ మహా అద్భుతం ఒక దయ్యం చేస్తుందంటే వారు నమ్మకున్నారు. తన గొర్రెలన్నిటిని ప్రభువు ప్రేమించినా, తిరిగి వారిలో కొందరు ఆయనను ప్రేమించారు, కొందరు ఆయనను ద్వేషించారు. తన్ను వెంబడించడానికి ప్రభువు మనలను పిలిచినా, తీర్మానాన్ని మాత్రం ఆయన మనతోనే ఉంచినట్టు వారి ప్రత్యుత్తరం జ్ఞాపకం చేస్తుంది.

యేసు గొర్రెల మంచి కాపరి. ఆయన గొర్రెలు ఆయన స్వరం వింటాయి ఆయనను వెంబడిస్తాయి. నేడు ఆయన కొండ శిఖరాన నిలిచి నిన్ను పిలుస్తున్నాడు. ఆయన స్వరాన్ని నీవు వింటున్నావా? ఆయన స్వరాన్ని నీవు గుర్తిస్తున్నావా? నీవు ఆయనను వెంబడిస్తావా? గుర్తుంచుకో, ఆయన నీ కొరకు తన ప్రాణాన్ని పెట్టాడు!

---

సూచన

[1]Michael Green, *Illustrations for Biblical Preaching* (Grand Rapids, Mich.: Baker Book House, 1982), 420.